కథా నిలయం
5861
శ్రీకాకుళం

# వినోద ప్రదర్శన

"నా జీవితమంటే ఏమిటి? నేను సత్యంతో చేసిన సాధనలే గదా!" అన్నాడు మహాత్ముడు.

రంగయ్యను గురించి చెప్పవలసివస్తే అతడి జీవితమంతా బాహ్య పరిస్థితులతో సలిపిన పోరాటమేనని చెప్పవచ్చు. భూమితో పోరాటం, అప్పులవాళ్ళతో పోరాటం, బిడ్డలతో పోరాటం, చివరకు తన భార్యతో గూడా పోరాటమే.

పితృపారంపర్యంగా రంగయ్యకు లభించిన భూస్థితి కొద్ది పాటిది. రెండెకరాల మడిచెక్క. ఒకటిన్నర ఎకరా మెట్టనేల. మెట్టసాగు దైవాధీనం. ఉన్న మడిగూడా ఏటి కాలువక్రింద గానీ, చెరువుక్రింద గానీ లేదు. దానికి బావినీరే ఆధారం. దాన్ని బావి అనడంకన్నా పెద్ద గొయ్యి అనడమే సమంజసం.

ఆ బావికి దరి నిలవదని ఎప్పుడో తేలిపోయింది. వాన కురిసినప్పుడల్లా దరి కరిగి కరిగి బావిలోకి జారిపోతుంది. ఏడాది కొకసారి పూడెత్తకపోతే బాన నీటిలో మునగదు. ఇద్దరు కుర్రాళ్ళు, ఇద్దరు కూతుళ్ళు పెరిగి పెద్దవాళ్ళై పోతున్నారు. వీళ్ళకు పెళ్ళిళ్ళు చేయాలి. ఈ కొడుకులకు గూడా పిల్లలు పుడితే వాళ్ళకు ఆస్థి ఏ మూలకు చాలుతుంది? మరి కొంత ఆస్థి ఏర్పాటు చెయ్యాలి. అందుకు దారి? ఇదుగో ఈ బావికి ఖచ్చితంగా దరి మలిపించి కాలుపురాళ్ళతో కట్టించి ఓ పంపుసెట్టు బిగించాలి. ఆ కయ్యలో మిరపతోట, ఈ కయ్యలో పసుపు, ఆ పాదిలో అరటిచెట్లు, కొన మడిలో తమలపాకుల తోట, మిగిలినదంతా వరిపైరు, లేదంటే ఓ అయిదు గుంటలో కయ్యలో చెఱుకుతోట, గనుములవెంట కొబ్బరిచెట్లు. ఈ చిరకాల స్వప్నం నిజమయ్యేదెప్పుడు? ఈలోగా లోతు బావిలో అనుదినమూ కబిన తోలవలసి వుండడంవల్ల ఎంతమంచి గిత్తలయినా రెండేళ్ళలో బక్కచిక్కి ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. వాటిని అయినకాడికి తెగనమ్మాలి. మళ్ళీ వందలు పోసి కొత్త గిత్తలు కొనాలి. ఇందుకు డబ్బు? అప్పు చెయ్యడమే గత్యంతరం. బావిగట్టున పూడు మట్టిదిబ్బ పెరిగినట్లే అవతల అప్పులు కూడా పెరుగుతున్నాయి. రాత్రుళ్ళు ఈ సంగతి తలచుకుంటే రంగయ్యకు నిద్రపట్టదు. ఈ అంతులేని ఆరాటాన్ని అర్థంచేసుకున్న దెవ్వరు? రంగయ్య తెల్లవారు జామునే లేస్తాడు. ప్రొద్దుపుట్టేదాకా కబిల తోలుతాడు. ఆ తరువాత మేడి పట్టుకుంటాడు. అండ చెక్కుతాడు. బండి కడతాడు. ఏ పనీ లేకపోతే కత్తి చేత పట్టుకొని కట్టెలకోసం అడవికి వెడతాడు. ఇందాకా నేను చెప్పింది పొరబాటు.

రంగయ్యా పోరాటం ముఖ్యంగా దరిద్రంతో. నా చిన్నతనంలో మావైపున ఉట్లతిరణాల అన్న పేరుతో ఒక వేడుక జరుగుతుండేది. సన్నటి కొయ్యకంభం ఒకటి. దానికి మరింత నున్నగా బంకమట్టి పూత. ఆ శరీరానికి ఆముదం పూసుకున్న మనిషి ఒకడు ఆ కొయ్యనంటిపెట్టుకొని ప్రాకి దాని అగ్ర పీఠంలో వున్న బహుమతిని అంది పుచ్చుకోవాలి. పైకెక్కడం పట్టు దొరకక క్రిందికి జారిపోవడం కంభంచుట్టూ రాసి పోసి వుంచిన బంకమట్టిలో పడిపోవడం, ఎంతకూ తెమలని ఈ వ్యాసంగం చూపరుల పాలిటికి పెద్ద తమాషాగ వుండేదన్న మాటమాత్రం కాదనలేను. బహుశా దారిద్ర్యంతో రంగయ్యా పడుతున్న కుస్తీగూడా లోకుల కలాగే గోచరించి వుండవచ్చు.

నీకు నామీద బొత్తిగా సానుభూతి లేని పక్షంలో నేను నిజంగా కడుపు చించుకున్నాసరే, నీకది గారడీ విద్యగానే కనిపిస్తుంది. అప్పులు లేకుండా బ్రతకడం, పస్తులు లేకుండా తినడం ఈపాటి ప్రయత్నాన్ని దురాశగా భావించనక్కరలేదు. కానీ రంగయ్యాను లోకులు ఆశబోతుగా వ్యవహారించడం నా చెవులతో నేను విన్నాను.

ఆ కుటుంబం లోకులపాలిటి కొక వినోద ప్రదర్శనగా తయారు గావడానికి వీలయినంతలో రంగయ్యా భార్యాబిడ్డలు గూడా సహకరించారనే చెప్పాలి. ఒళ్ళువంచి పనిచెయ్యడంలో మంగమ్మ రంగయ్యాకు తీసిపోదు. ఎడతెగని పనులమూలంగా ఆవిడకు ఉన్న రెండు చీరల్లో ఒకటి వుతికి కట్టుకోడానికి గానీ, చింపిరి తలను దువ్వి ముడివేసుకోడానికి గానీ, నుదుట బొట్టు పెట్టుకోడానికి గానీ తీరికుండదు. ఎటొచ్చీ ఆమె నాలుకకు

వాడి పెచ్చు. ఈ కుటుంబంలో లేమి వుంది. అది రంగయ్య సృష్టించినది కాదు. కానీ మంగమ్మ అలా భావించదు. ఇంట్లో ఏ వస్తువు కొరతపడినా, ఏ కోరిక తీరకపోయినా ఎడా పెడా వాగడమే--అది గొంతు కాదు. పెద్ద మైకు. పెండ్లివారి విడిదిలో నుంచి మైకు ద్వారా వినవచ్చే పాటలను ఎలాగైతే వినగలరో, అంత ఆనందంగానే మా వూరివాళ్ళా మంగమ్మ మాటలను వినగలరు. ఈ రేడియోలో వాల్యూము తగ్గించడానికి గానీ, లేదా పూర్తిగా నోరు మూయించడానికి గానీ రంగయ్యకు తెలిసిన చిట్కా ఒక్కటే. శ్రుతి మీరినప్పుడల్లా అతడు మంగమ్మను నమ్మకంగా పిడిగ్రుద్దులతో సత్కరించేవాడు. అప్పుడిక చూచుకోవలసిందే తమాషా. అతడివేమో పెడబొబ్బలు, ఆమెవేమో హాహాకారాలున్నూ, ఆక్రందనలు. ఈ హంగామా అంతా నాలుగు గోడలమధ్య జరిగినా యిదొక శ్రవ్యరూపకం. అలా గాకుండా బాహాటంగా బయటనే జరిగినట్లాయెనా అప్పుడది దృశ్యనాటిక.

రంగయ్య కొడుకుల్ని గురించి నికరంగా ఒక మాట చెప్పవచ్చు. వాళ్ళు తండ్రికన్నా కొన్ని దశాబ్దాలు వెనుక పుట్టినవాళ్ళు. న్యాయం, ధర్మం, సత్యం మొదలైన నైతిక విలువలపట్ల తండ్రికున్నంత నమ్మకం వాళ్ళకుండకపోవడం సహజమే! వాటిని నమ్ముకోవడంవల్ల తండ్రి బ్రతుకు ఎంత వైభవోపేతంగా వున్నదో వాళ్ళెరుగుదురు. అందువల్ల చేతి ఖర్చుకు డబ్బు అవసర మనిపించినప్పుడల్లా వాళ్ళు చేతులు ముడుచుకొని కూచోకుండా కొంచెం కొంచెంగా స్వప్రయోజకత్వాన్ని వెలగబెడుతూ వచ్చారు. ఒక అరటిగెల, ఒక తట్ట తమలపాకులు, పది కొబ్బరికాయలు. కానీ అదేం గ్రహచా

రమో గానీ రంగయ్య కొడుకులు తస్కరించి, తస్కరించిన కొద్ది గంటలకే పట్టుబడిపోయేవారు. వెంటనే రచ్చపైన పంచాయితీ, వాది పిర్యాదు, నేర ప్రతిపాదన, సాక్షుల కథనం, పెద్దమనుష్యుల విచారణ, మొండికెత్తినట్టుగా రంగయ్య తిరగబడడం, బెదిరింపులు, పదో ఇరవయ్యో చెల్లించుకోవడాలు — ఈ కోర్టు సీను తిలకించడానికి ఆబాల గోపాలమూ వచ్చి రచ్చదగ్గర గుమిగూడేవారు; నిజం చెప్పొద్దూ మా వూళ్ళో సినిమా థియేటరు లేని కొరత యిలాంటి పంచాయితీలవల్ల తీరిపోతుండేది.

అప్పట్లో నేను హైస్కూలులో చదువుకుంటూ వుండేవాడిని. హైస్కూలునుంచి కాలేజీకి వెళ్ళాను. ఆ తర్వాత ఉద్యోగంలో చేరాను. ఎప్పుడైనా సెలవుల్లో ఇంటికి వెళ్ళినప్పుడే రంగయ్యను గురించి తెలుసుకునే అవకాశం.

సచ్చి సేయంగల విన్నపాలతో రంగయ్య పెద్ద కూతురికి పెళ్ళి చేశాడు. ఇంట్లో జరుగుతున్న మొదటి శుభకార్యం గదా! సాటి బంధువుల్లో నామోషీ లేకుండా వుండడంకోసం ఓ వెయ్యి రూపాయలు అప్పుకూడా చేశాడు. ఆ అప్పు కాస్తా తీరేదాకా యింట్లో యింకొక శుభకార్యం మాటెత్తడానికి వీల్లేదని తనలో తాను నిర్ధారించుకున్నాడు. కానీ ఆమాత్రం ఓపరికం చిన్న కూతురికి లేకపోయింది. ఆమె ఓ కుర్రాడివెంట లేచిపోయి, చక్కా గుడిలో పెళ్ళిచేసుకుంది. సినిమాలోనూ, సాహిత్యంలోనూ ప్రేమ వివాహాలు కంటగించుకోబడలేదు. కానీ రంగయ్యదగ్గరకు వచ్చేసరికది మనిషి తలెత్తుకు తిరగడానికి వీల్లేని సామర్ధ్యా పనిగా చిత్రింపబడింది. ఆ పిల్లకు పిల్లవాడికి మొదట మనసు లెలా కలిసిందీ, ఆ మోజు ఏయే విధాలుగా

విస్తరించిందీ, వాళ్ళు లేచిపోవలసిన పరిస్థితి ఎలా ఏర్పడిందీ, అందుకు వాళ్ళు పన్నిన పథకం, దాన్ని అమల్లోపెట్టిన తీరు, ఆ విషయం తెలిసేసరికి రంగయ్యా అగ్గిమీద గుగ్గిలం కావడం యిదంతా పరస్పరం చెప్పుకుని సంతోషించడానికి వీలుగా మా వూరివాళ్ళకొక ఆరు నెలల మేత దొరికింది.

ఇంతలో రంగయ్యా పెద్దకొడుకు తానేమీ నెలతక్కువగా పుట్టినవాడు కాదని నిరూపించ దలచుకున్నట్లుగా కథానాయకుడి పార్టు ధరించి రంగంలో దిగాడు. ఇంతకూ అతడు చేసింది అనుచితమైన పని కాదు. ఓ పొరుగూరి అమ్మాయిని పెళ్ళాడతానన్నాడు. వీళ్ళకూ వాళ్ళకూ ఏదో దూరపు బంధుత్వం గూడా వుంది. కానీ ఇందులో ఒక యిబ్బంది వున్నట్లు తోచింది. ఆ కుటుంబంపట్ల రంగయ్యాకు సదభిప్రాయం లేదు. తన కొడుకు ఆ యింటికి అల్లుడు కావడానికి అతడు ససేమిరా వీల్లేదన్నాడు. ఆ కొడుకు ఆరు నూరైనా, నూరు ఆరైనా ఆ పిల్లను చేసుకోక తప్పదని తిరుగుబాటు చేశాడు. రంగయ్యా వుక్రోశం పట్టలేక ఆస్థిలో వాడి భాగం వాడికి పంచి పెట్టేశాడు. వాడి దారిని వాణ్ణి వెళ్ళమన్నాడు. అప్పటికి తానేదో రాజ్యాన్ని జయించినట్టుగా కొడుకు పెళ్ళిపీటలమీదికి సిద్ధమయ్యాడు. పులిమీద పుట్రలా భర్తమాట కాదని ఈ పెళ్ళికి కాస్తా మంగమ్మ గూడా హాజరైపోయింది.

కొడుకే గాదు, కట్టుకున్న భార్య గూడా తన మాటలకు లోబడి వుండడంలేదు. లోకుల యెదుట రంగయ్యాకు తల కొట్టివేసినంత అవమానమైపోయింది. వాడు నా కొడుకే గాదు, ఆవిడ నా పెళ్ళాం కాదు—అని భీషణంగా పంతంబట్టి కూర్చునే దాకా లోకం రంగయ్యాను సమర్థించలేదు.

ఈ విధంగా అతడు తన పాత్రౌచిత్యాన్ని కాపాడు కున్నట్టుంది.

అన్నదమ్ములు వేరు కాపురాలు పెట్టేశారు. పెద్దవాడికి పూరిల్లు వచ్చింది. చిన్నవాడికి గుడిసె దక్కింది. భూస్థితిలోనూ అలాగే చెరిసగం. అప్పుల్లోనూ ఇంతే. తల్లిదండ్రుల్ని గూడా అలాగే పంచుకున్నారు. మంగమ్మ పెద్దకొడుకు వైపున వుండి పోయింది. రంగయ్య చిన్నవాడి వాటాకు వెళ్ళాడు.

ఈ విచిత్ర పరిణామం లోకుల కాలక్షేపాని కెంతగా వుపకరించిందని? నాటకంలో అనుకోని మలుపు కదటండీ మరి!

'బలే గమ్మత్తురా ఈవేళ చెప్పనలవిగాదు చూచి తీరవల సిందే రంగయ్య అవతారం' వెకిలి నవ్వుతో ఉపక్రమణిక.

'ఏం జరిగిం దేం జరిగింది?' పది మందిలోనూ పెల్లుబికే కుతూహలం!

'పెద్దవాడు నాటిన చెరుకుతోట బాగా ఏపుగా పెరి గిందిలే; ఆవు గోడ్డుకు కావలసినంత మేత కావలసి వచ్చిం దేమో! రంగయ్య యెవ్వరూలేనిది చూచి ఓ మోపెడు చెరుకు మోసులు కోసుకున్నాడు. మోపు తలకెత్తుకుని తోట దాటు కుని పోతున్నాడో లేదో మంగమ్మ ఎదురైంది. 'హవ్వ హవ్వ యింతపనికి పూనుకున్న మనిషివి నువ్వు తలపైన రాయి వెయ్యవా? నీదీ ఒక నరజన్మేనా? ఇది ఒక బ్రతుకేనా?' అంటూ మంగమ్మ కారుబారు చేసిందిలే! వడగండ్లలా రాలి పోయాయి మాటలు. ఇచ్చేది యిస్తేగానీ యిది తగ్గిరా

దనుకున్నాడు. రంగయ్య మోపు క్రిందికి గిరవాటుపెట్టి ఎగిరి మంగమ్మ వైపుకు దూకాడు.'

'పడ్డాయా గుద్దులు ?
తగిలాయా తన్నులు ?
జుట్టుముడి వూడిపోయిందా ?'

'చెబుతున్నానుగా! ముసలాడు పైకి దూకేస్తున్నాడని పసిగట్టేసరికి మంగమ్మ వున్నట్టుండి ఈవలికి తప్పుకుంది. దూకిన విసురులో రంగయ్య వెళ్ళి 'అడుసు మడిలో పడిపోయాడు. నా సామిరంగా, ఒళ్ళంతా బురదే! బట్టలంతా బురదే! ముఖమంతా బురదే! బురదలో దొర్లి లేచిన బర్రెగొడ్డే నయం. లేచి వచ్చాడంటే సున్నంలోకి లేకుండా ఎముకలు విరగగొడుతాడని మంగమ్మ దొకటే పరుగు...

ఈనాటి కిదైందా, రేపటి కాలక్షేపానికి రంగయ్య బ్రతుకులోనుంచీ సరికొత్త సంఘటన ఒకటి పుట్టుకొచ్చింది.

దూర ప్రాంతానికి బదిలీ కావడంవల్ల రెండేళ్ళపాటు నేను మా వూరివైపు వెళ్ళడం కుదరలేదు. ఒకసారి మా అమ్మే మమ్మల్ని చూచిపోవడానికి వచ్చింది. కాలపురుషుడు రంగయ్యను ఎలా అనుగ్రహిస్తున్నది ఆమె ద్వారా తెలుసుకోగలిగాను.

'ఏం రంగయ్యరా నాయనా! ఉడిగిపోయాడు. నిరుడీలాంటప్పుడు అడవిలోనుంచీ బండి తోలుకొస్తూవుండి చక్రం క్రింద పడిపోయాడు. తుంటి నలిగిపోయింది. కాలు తీయవలసిందే నన్నారు. ఏదో అతడి పాలిట దేవుడుండి అంతపని

జరగలేదు. కుంటివాడుగా మిగిలాడు. కొయ్యాపైన గానీ నడువలేడు...'

'మంగమ్మ ఎలా వుంది?'

'మంగమ్మ ఎక్కడుంది? ఆవిడ పోయి ఆరు నెలలైంది. పుణ్యాత్మురాలు. మొగుడు బ్రతికుండగానే పసుపూ కుంకుమతో వెళ్ళిపోయింది. ఆవిడ కళ్ళు మూసిందని తెలియగానే రంగయ్య ఆవు అరచినట్లుగా అరచేడట్రా బాబూ! వారం రోజులు తిండీ నీళ్ళు ముట్టుకోలేదట!'

చివరిసారిగా రంగయ్యను చూచింది ఏర్పేడు బస్ స్టాండులో. ఆఫీసు పనిమీదుగా నెల్లూరు వెళ్ళి వస్తుండగా బస్సక్కడ కాస్సేపు ఆగింది. సిగరెట్లకోసం బస్సు దిగి బంకు వైపు వెల్తూండగా ఎవరో పిలిచారు. తిరిగి చూద్దునుగదా! ఒక మానవ కంకాళం ప్రత్యక్షమైంది. మొల కొకచే బట్ట, వంగిపోయిన వెన్నెముక, గుంటలుపడిన దవడలు, లోతుకు పోయిన కళ్ళు.

'బాగున్నావా చినబాబూ! ఎంతకాలానికి కన్పించావు! చిన్నమ్మా పిల్లలూ అంతా ఖులాసాయే కదూ?'

'పిచ్చి రంగయ్యా! నువ్వింకా తోడి మానవుల క్షేమ సమాచారాలు విచారించే స్థితిలోనే వున్నావా' అనుకున్నాను.

తల్లి పోయిన తర్వాత తండ్రికి తిండిపెట్టే విషయంలో అన్నదమ్ము లిద్దరికీ సరైన ఒప్పందం కుదరలేదట! పడీ లేచీ ఆఖరకు ఈ రోజొకడు పెడితే, రేపొకడు పెట్టేటట్లుగా వంతులు వేసుకున్నారట! కానీ ఆ సత్కార్యం గూడా సజా

వుగా జరిగేటట్లు లేదు. తిండి పెట్టటంలోకన్నా పెట్టకపోవడం లోనే ఆ యిద్దరికీ పోటి ఎక్కువైందట!

'పర్వాలేదు బాబూ! నా దేముంది? రాముడున్నాడు, రాజ్యముంది. ఈ ముసలికట్టె కింత తిండి దొరక్కపోదు. ఒక్కటేనయ్యా నాకు దిగులు. పుట్టినవాళ్ళిద్దరు కొట్టుకు చస్తున్నారు. చీటికి మాటికీ జగడాలు! నాల్రోజుల కొకసారి మధ్యస్థాలు. బ్రతకడానికి ఇళ్ళంటూ ఏవో వున్నాయి. కానీ బ్రతుకంతా వీధిపాలే అయిపోయింది.'

నాకిప్పు డర్థమైంది. రంగయ్యకిక ప్రదర్శనలో పాల్గొనే ఓపిక లేదు. అతడు రేపో మాపో తన వేషం విప్పిపెట్టేస్తాడు. కానీ వినోద ప్రదర్శనం నిరంతరాయంగా సాగిపోవడాని కింకా అక్కడ అతని కొడుకు లున్నారు, కోడళ్ళున్నారు. వాళ్ళకూ బిడ్డలుంటారు, ఇంకా పుడతారు. తాతకట్టిపెట్టినపూరి కొంప ల్లోనే వాళ్ళు గోడలు పెట్టుకుంటారు. నేలను ముక్కచెక్కలు చేసి పంచుకుంటారు. కానీ అమాత్రం స్థితిగతులైనా ఎంతకాలం నిలుపుకుంటారు? బ్రతుకు వాళ్ళచేత రకరకాల వేషాలు వేయిస్తుంది. ప్రేక్షక మహాశయులు తనివి తీరేటట్లుగా ఈ ప్రదర్శనాలు తిలకించవచ్చు. ఆలస్యం చేసినా అశాభంగమన్న మాట లేదు. ఎంతసేపు చూసినా టిక్కెట్టు లేదు!